# సాక్షి రాజన్న సిరిసిల్ల

బుధవారం । 25 । అక్టోబర్ । 2023


### రాజన్న సన్నిధిలో ఆయుధ పూజ

వేములవాడ: దసరా పండుగను పురస్కరించుకుని రాజన్న ఆలయంలో సోమవారం ఆయుధ పూజ నిర్వహించారు. ఉదయం ఆలయంలోని ఆయుధాలన్నింటినీ ఒకేచోట చేర్చి స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు.





వేడుకల్లో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, హిందూ ఉత్సవ సమితి సభ్యులు



అశ్వవాహనంపై శోభాయాత్రగా వస్తున్న స్వామివారు



రాంలీలా మైదానంలో రావణ దహనం వీక్షణకు తరలివచ్చిన జనం



వేములవాడలో అంబారిసేవపై స్వామివారి శమీయాత్ర

## దసరా వైభవం

సిరిసిల్లటౌన్: దసరా పండుగను పురస్కరించుకుని మంగళవారం సిరిసిల్ల మానేరువాగు ఒడ్డున రాంలీల మైదానంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో రావణ సంహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 20 అడుగుల ఎత్తులో రావణాసురుడి ప్రతిమను ఆమె చేతుల మీదుగా దహనం చేశారు. కార్యక్రమంలో చెన్నమనేని రమణారావు దేశాయ్, హిందు ఉత్సవ సమితి అధ్యక్షుడు చేపూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మేర్గు సత్యం, గౌరవ అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**నేత్రపర్వం.. శమీ దర్శనం**

విజయదశమిని పురస్కరించుకుని సిరిసిల్ల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి భక్తజనులకు శమీ దర్శనం ప్రాప్తి కల్పించారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు అశ్వవాహనంపై మానేరువాగు తీరాన ఉన్న జమ్మిచెట్టు వద్దకు చేరుకున్నారు. అనంతరం స్వామివారికి భక్తులు జమ్మితో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు ఉప్పల విఠల్‌రెడ్డి, చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, ఈవో మారుతిరావు, ఏఈవోలు రవీందర్, ప్రభాకర్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగిశాయి. దుర్గామాత విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి మానేరు వాగువద్ద నిమజ్జనం చేశారు.

**వేములవాడలో..**

వేములవాడ: రాజన్న సన్నిధిలో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పురవీధుల్లో అంబారిసేవలో స్వామివార్ల శమీయాత్ర నిర్వహించారు. మహాలక్ష్మి ఆలయం వద్ద జంబిచెట్టుకు పూజలు చేశారు. రాత్రి 9 గంటలకు నిషిపూజ, ఏకాంత సేవ పూజలతో ఉత్సవాలు ముగిసినట్లు స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ తెలిపారు.



రావణ దహనం

## న్యూస్‌రీల్

### మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



వేములవాడ: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా రాజన్న ఆలయంలో చివరిరోజు సోమవారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. నాగిరెడ్డి మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైన మహాలక్ష్మి అమ్మవారిని, బాలా త్రిపురసుందరిదేవి, శ్రీరాజరాజేశ్వరి అమ్మవార్లను మహాలక్ష్మి రూపంలో అలంకరించారు. ఆలయంలో మూడు చోట్ల ఉన్న అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

### సీఎం కేసీఆర్‌ను కలిసిన తోట ఆగయ్య



సీఎం కేసీఆర్‌తో ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మంగళవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. సీఎంతోపాటు మంత్రి కేటీఆర్‌ను కలిశారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. తెలంగాణ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

### 'సీబీఐ విచారణ చేపట్టాలి'



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ: కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్టు వంతెన కుంగడం అవినీతికి నిదర్శనమని, ప్రాజెక్టు నాణ్యతను గాలికి వదిలేసి, కమీషన్లకు కక్కుర్తిపడ్డారని అన్నారు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి అవినీతికి పాల్పడటంతో నాణ్యత లోపించిందని, ప్రజలపై భారం మోపుతున్నారని, ఇందుకు బాధ్యులైన కేటీఆర్, హరీశ్‌రావులు రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. 2018 ఎన్నికల ముందు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించేటప్పుడు బస్సులు పెట్టి రైతులను తరలించిన సీఎం కేసీఆర్ అదే రైతులకు మళ్లీ బస్సులు పెట్టి కుంగిన ప్రాజెక్టును చూపించాలన్నారు. చిన్న నేరాలు జరిగితేనే సీఐడీ, ఈడీ, సీబీఐలతో విచారణ జరిపించే కేంద్రం మేడిగడ్డ కట్ట కుంగితే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన రమాకాంత్‌రావు

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన సీనియర్ న్యాయవాది, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవునూరి రమాకాంత్‌రావు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీజేపీకి రాజీనామా చేసి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. సిరిసిల్ల బీజేపీ టిక్కెట్‌ను ఆశించిన రమాకాంత్‌రావుకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో ఆ పార్టీని వీడారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, టీపీటీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణిలు రమాకాంత్‌రావు ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. మంత్రి కేటీఆర్ ఆహ్వానం మేరకు రమాకాంత్‌రావు హైదరాబాద్ వెళ్లి పార్టీలో చేరారు. ఆయన వెంట టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



రమాకాంత్‌రావును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

2018 ఎన్నికల్లో బీఎస్‌పీ అభ్యర్థిగా రమాకాంత్‌రావు పోటీ చేశారు. సిరిసిల్ల జిల్లా సాధన సమితి కన్వీనర్‌గా పని చేసిన అతడు బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరడం చర్చనీయాంశంగా మారింది.

## 'లగిశెట్టి'కి టికెట్ కేటాయించాలి

సిరిసిల్ల: పద్మశాలీలకు ఏ పార్టీ కూడా టిక్కెట్ కేటాయించకపోవడంపై సిరిసిల్ల పద్మశాలీ సమాజం ఆగ్రహం వ్యక్తం చేసింది. బీజేపీ టిక్కెట్‌ను పద్మశాలీ సమాజానికి చెందిన లగిశెటి శ్రీనివాస్‌కు ఇస్తామని మాట ఇచ్చిన ఆ పార్టీ ఆయనకు టిక్కెట్ కేటాయించకపోవడంతో పార్టీ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. సిరిసిల్ల అంబేద్కర్ సర్కిల్ వద్ద దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. అన్ని పార్టీలు పద్మశాలీలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. సిరిసిల్లలో పద్మశాలీల ఓట్లు అధికంగా ఉన్నా ఏ పార్టీ కూడా గుర్తించడం లేదన్నారు. బీజేపీ ఇప్పటికైనా మళ్లీ పునరాలోచన చేసి సిరిసిల్ల టిక్కెట్‌ను లగిశెట్టి శ్రీనివాస్‌కు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పద్మశాలీ సంఘం నాయకులు కొండా ప్రతాప్, ద్యావనపెల్లి రామకృష్ణ, రాజేశం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పద్మశాలీలు

## ఎన్నికలకు పటిష్ట బందోబస్తు



ఫ్లాగ్‌మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



వేములవాడలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు సిబ్బందికి సహాయంగా రెండు కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు జిల్లాకు చేరుకున్నాయని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో 100 మంది పోలీస్ సిబ్బంది 200 మంది కేంద్ర బలగాలతో కలిసి నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి గాంధీ, అంబేద్కర్, గోపాల్‌నగర్ చౌరస్తాల మీదుగా బీవైనగర్, సంజీవయ్యనగర్, వెంకంపేట్ మీదుగా కొత్తబస్టాండ్ వరకు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. బీఎస్ఎఫ్‌తోపాటు మరికొన్ని బలగాలు వస్తాయని పేర్కొన్నారు. ఇప్పటి నుంచే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. జిల్లాలో మొత్తం 560 పోలింగ్ కేంద్రాలు ఉండగా 118 క్రిటికల్ కేంద్రాలను గుర్తించడం జరిగిందని, ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా పరిధిలో 5 చెక్ పోస్టులతో పాటు డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ ఉపేందర్, ఆర్ఐ యాదగిరి, బీఎస్ఎఫ్ కమాండెంట్, అడిషనల్ కమాండెంట్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వేములవాడలో..**

వేములవాడ: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వేములవాడలో పోలీసులు మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. రాజన్న ఆలయం ముందు ఎస్పీ అఖిల్ మహాజన్ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. పాపన్న చౌక్ నుంచి మొదలైన కవాతు కాలేజ్ రోడ్డు, బద్దిపోచమ్మ, రాజన్నగుడి, మెయిన్‌రోడ్డు, అమరవీరుల స్తూపం, మూలవాగు బ్రిడ్జి, తిప్పాపూర్ బస్టాండ్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ కృష్ణకుమార్, కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

## చొప్పదండి.. స్థానికేతరులదేనండి!

- ఆరుసార్లు నియోజకవర్గేతరులదే విజయం
- రెండు దశాబ్దాలుగా గెలవని జాతీయ పార్టీలు
- టీడీపీ కంచుకోటకు బీటలు
- గోదావరి జలాలతో వాటర్ హబ్‌గా మారిన వైనం

### 1957లో శాసనసభ నియోజకవర్గం ఏర్పాటు




చొప్పదండి: చొప్పదండి శాసనసభ నియోజకవర్గం 1957లో ఏర్పడింది. అప్పటినుంచీ స్థానికేతరులకు అడ్డాగా మారింది. అసెంబ్లీ ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల తరఫున నియోజకవర్గేతరులు పోటీ చేయడం సర్వసాధారణమైంది. ఇప్పటివరకు పన్నెండు సార్లు ఎన్నికలు జరుగగా, ఆరుసార్లు స్థానికేతరులే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. పలుమార్లు ఓడిపోయిన అభ్యర్థులు కూడా స్థానికులు కాకపోవడం ఈ నియోజకవర్గ ప్రత్యేకత.

**తొమ్మిది సార్లు రెండోస్థానమూ వారిదే**

చొప్పదండి నుంచి 1957లో పీడీఎఫ్ తరఫున పోటీ చేసిన వేములవాడ మండలానికి చెందిన చెన్నమనేని రాజేశ్వర్‌రావు తొలిసారి ఎన్నికల్లో గెలుపొందారు. రెండోసారి 1962లో జరిగిన ఎన్నికల్లో బెజ్జంకి మండలానికి చెందిన బి.రాములు ఎన్నికయ్యారు. స్థానిక అభ్యర్థులుగా 1978లో న్యాలకొండ శ్రీపతిరావు, 1985 నుంచి వరుసగా మూడుసార్లు న్యాలకొండ రాంకిషన్‌రావులు మాత్రమే గెలిచారు. 1983లో పెగడపల్లి మండలానికి చెందిన గుర్రం మాధవ రెడ్డి, 1999లో కరీంనగర్‌కు చెందిన కోడూరి సత్యనారాయణగౌడ్, 2004లో వెల్గటూరు మండలానికి చెందిన సాన మారుతి విజయం సాధించారు. 2009లో అంతర్గాంకు చెందిన సుద్దాల దేవయ్య, 2014లో సైదాపూర్ మండలంలోని వెంకటేశ్వరుల పల్లెకు చెందిన బొడిగె శోభ గెలుపొందారు. ఇక పన్నెండు సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తొమ్మిది సార్లు రెండో స్థానంలో నిలిచినవారూ స్థానికేతరులే కావడం కొసమెరుపు.

**పునర్విభజనతో విచ్ఛిన్నం**

నియోజకవర్గంలో ప్రధానంగా చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలు పూర్తిస్థాయిలో ఉన్నాయి. పునర్విభజనకు ముందు కరీంనగర్ మండలంలో కొన్ని గ్రామాలు, వెల్గటూర్, పెగడపల్లి, గొల్లపల్లి మండలాల్లో మరికొన్ని గ్రామాలు ఉండేవి. పునర్విభజన సమయంలో చొప్పదండి, రామడుగు, గంగాధరతోపాటు కొడిమ్యాల, మల్యాల, బోయినపల్లి మండలాలను చొప్పదండిలో కలిపారు. ఇక తెలంగాణ వచ్చాక నూతన జిల్లాల ఏర్పాటు సమయంలో చొప్పదండి నియోజకవర్గాన్ని మూడు ముక్కలు చేశారు. ప్రస్తుత కరీంనగర్ జిల్లాలో మూడు మండలాలు ఉండగా, బోయినపల్లి మండలాన్ని రాజన్నసిరిసిల్ల జిల్లాలో, కొడిమ్యాల, మల్యాల మండలాలలను జగిత్యాల జిల్లాలో కలిపి, నియోజకవర్గ స్వరూపాన్ని మార్చేశారు.

**జీవనోపాధికి వలసలే మార్గం**

మెట్ట ప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గ ప్రజలకు దశాబ్దాలుగా జీవనోపాధి నిమిత్తం వలసలు వెళ్లడమే ఏకైక మార్గం. బొంబాయి, భీవండితోపాటు దుబాయి, అబుదాబి, సౌదీ అరేబియా, మస్కట్, దోహా ఖతార్ తదితర దేశాలకు వెళ్తున్నారు. మెజారిటీ గ్రామాలు మెట్ట ప్రాంతంలో ఉండటంతో ఏటా వర్షాలపై ఆధారపడి పంటలు వేయడం, అవి చేతికి వచ్చే సమయంలో వర్షాభావంతో ఎండిపోవడం, లేదా దిగుబడి తగ్గుతున్న దుస్థితిని ఇక్కడి రైతులకు ఎదుర్కొంటున్నారు.

**వరద కాలువతో పెను మార్పు**

అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన శ్రీరాం సాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ తవ్వకంతో చొప్పదండి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగునీరందేది. ఆపై కాలువల తవ్వకం లేకపోవడంతో సాగునీటి కోసం రైతులు పోరాటాలు చేసేవారు. తన పాదయాత్రలో వారి కష్టాలను ఉమ్మడి ఏపీ మాజీ సీఎం, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరద కాలువ నిర్మాణం పూర్తి చేశారు. ఇది ఎక్కువగా ఈ నియోజకవర్గంలోనే విస్తరించి ఉంది. ఈ కాలువకు తోడు ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించి పైప్‌లైన్ ద్వారా నారాయణపూర్ ప్రాజెక్టుకు నీటిని తరలించే పనులను, మిడ్ మానేరు నిర్మాణానికి భూసేకరణను వైఎస్సార్ హయాంలోనే పూర్తి చేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత చివరి దశ పనులు జరిగి, చొప్పదండి వాటర్ హబ్‌గా మారింది. లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్, బోయిన్‌పల్లి మండలంలో నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్టు, మల్యాల నుంచి బోయినపల్లి వరకు నిర్మించిన వరద కాలువ ప్రస్తుతం నీటితో కళకళలాడుతున్నాయి. భూగర్భ జలాలు పెరగడంతో బావుల ద్వారా వ్యవసాయం చేసేలా పరిస్థితి మారింది.

**ప్రభావం చూపే అంశాలు**

నియోజకవర్గంలోని ఓటర్లలో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఇక్కడి ప్రజలకు వ్యవసాయమే ఆధారం. చాలీచాలని ఆదాయంతో చేనేత, మరమగ్గాల కార్మికులు జీవనం సాగిస్తున్నారు. ప్రతీసారి విలక్షణ తీర్పు ఇవ్వడం ఈ నియోజకవర్గ ఓటర్ల ప్రత్యేకత. తెలంగాణ రాక ముందు పదిసార్లు శాసనసభ ఎన్నికలు జరగగా ఆరు సార్లు టీడీపీ, నాలుగు సార్లు ఇతరులు గెలుపొందగా, తెలంగాణ వచ్చాక టీడీపీ కంచుకోటకు బీటలు వారాయి. ప్రత్యేక రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో రెండుసార్లు బీఆర్‌ఎస్ అభ్యర్థులే గెలిచారు. గడిచిన ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి మళ్లీ గెలవకపోవడం, రెండు దశాబ్దాలుగా జాతీయ పార్టీలను గెలుపుతీరాలకు చేర్చకపోవడం, ప్రాంతీయ పార్టీలనే అక్కున చేర్చుకోవడం వంటివి చొప్పదండి విశేషాలు.

### గెలుపు, ఓటముల వివరాలు

| ఏడాది | గెలిచిన అభ్యర్థి | పోలైన ఓట్లు | ఓడిన అభ్యర్థి | పోలైన ఓట్లు |
|---|---|---|---|---|
| 1957 | రాజేశ్వర్‌రావు (పీడీఎఫ్) | 99,074 | బి.రాములు (కాంగ్రెస్) | 8,054 |
| 1962 | బి.రాములు (కాంగ్రెస్) | 15,749 | ఆర్.రెడ్డి (స్వతంత్ర్య) | 8,216 |
| 1978 | ఎన్.శ్రీపతిరావు (కాంగ్రెస్.ఐ) | 26,311 | ఎం.కృష్ణారెడ్డి (కాంగ్రెస్) | 20,054 |
| 1983 | జి.మాధవరెడ్డి (టీడీపీ) | 36,133 | ఏఎస్.రెడ్డి (కాంగ్రెస్) | 18,651 |
| 1985 | ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ) | 55,141 | బండారి రామస్వామి (కాంగ్రెస్) | 13,704 |
| 1989 | ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ) | 47,783 | కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్) | 39,921 |
| 1994 | ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ) | 56,287 | కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్) | 30,600 |
| 1999 | కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్) | 54,754 | ఎన్.రాంకిషన్‌రావు (టీడీపీ) | 52,842 |
| 2004 | సాన మారుతి (టీడీపీ) | 45,211 | కె.సత్యనారాయణగౌడ్ (కాంగ్రెస్) | 41,096 |
| 2009 | సుద్దాల దేవయ్య (టీడీపీ) | 68,841 | గుసుకొండ బాబు (కాంగ్రెస్) | 35,853 |
| 2014 | బొడిగె శోభ(టీఆర్ఎస్) | 86,841 | సుద్దాల దేవయ్య (కాంగ్రెస్) | 31,860 |
| 2018 | సుంకె రవిశంకర్ (టీఆర్ఎస్) | 91,090 | మేడిపల్లి సత్యం (కాంగ్రెస్) | 48,963 |

### ఓటర్ల వివరాలు

| | |
|---|---|
| పురుషులు | 1,11,197 |
| మహిళలు | 1,18,141 |
| ఇతరులు | 08 |
| మొత్తం | 2,29,346 |

## క్లుప్తంగా

### ప్రగతిభవన్‌కు చేరిన పాదయాత్ర



నవీన్‌నాయక్‌ను అభినందిస్తున్న మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి: బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని, కేసీఆర్ సీఎం కావాలని కోరుతూ వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన అజ్మీర నవీన్‌నాయక్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం ప్రగతిభవన్‌కు చేరింది. ఈసందర్భంగా నవీన్‌నాయక్‌ను మంత్రి కేటీఆర్ అభినందించారు. ఈనెల 18న గ్రామం నుంచి ప్రగతిభవన్‌కు పాదయాత్ర చేపట్టాడు. ఇందుకు సహకరించిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డికి నవీన్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

### ఎంపీని కలిసిన జెడ్పీటీసీ



ఎంపీ సంతోష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను స్థానిక జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా పర్వదినం సందర్భంగా ఎంపీ కరీంనగర్ వచ్చారు. ఈ క్రమంలో ఆయనను పలువురు మండల నాయకులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వైస్‌ఎంపీపీ నాగయ్య, బీఆర్‌ఎస్ నాయకులు అనుముల భాస్కర్ తదితరులు ఉన్నారు.

### బీరు సీసాతో దాడి.. ఇద్దరిపై కేసు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీ పరిధి శాత్రాజుపల్లి వార్డులో సోమవారం రాత్రి బీరుసీసాతో ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. శాత్రాజుపల్లికి చెందిన గుడిసె తిరుపతిపై అదే వార్డుకు చెందిన గుడిసె కరుణాకర్, దీపక్ బీరు సీసాతో దాడి చేశారు. విషయం తెలుసుకున్న సీఐ ఘటనా స్థలానికి వెళ్లి తిరుపతిని వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### ఇరువర్గాల ఘర్షణ

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని తెర్లుమద్ది, ముస్తాబాద్‌లో సోమవారం రాత్రి జరిగిన దసరా ఉత్సవాల్లో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. తెర్లుమద్దిలో జంబి కొట్టే కార్యక్రమం అనంతరం ఇరువర్గాల మధ్య ఘర్షణ తలెత్తగా, ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. అలాగే ముస్తాబాద్‌లో పలువురు ఘర్షణ పడగా వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.



# నేత్ర పర్వం.. శ్రీనివాసుని కల్యాణం



కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు



సింహవాహనంపై స్వామివారి విహారం

సిరిసిల్లటౌన్: వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శ్రీలక్ష్మి, పద్మావతి వేంకటేశ్వరస్వామి వివాహ వేడుకలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు వేడుకలు కొనసాగాయి. రాత్రి 9గంటలకు హంస వాహనంపై శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసున్ని తిరువీధుల్లో ఊరేగించారు. ఈసందర్భంగా గోవింద నామస్మరణతో శ్రీవారి సేవాకార్యక్రమాలు భక్తులను పరవశింపచేశాయి.

**పులకించిన భక్తజనం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దసరా పండుగను పురస్కరించి ఆలయంలో ఉదయం 8 గంటలకు హోమం నిర్వహించారు. 10 గంటలకు సింహవాహనం, సాయంత్రం 5 గంటలకు అశ్వవాహనంపై శ్రీవారు విహరించారు. ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ మాజీచైర్మన్లు ఉప్పుల విఠల్‌రెడ్డి, తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు, ఈవో మారుతిరావు, ఏఈవోలు పీసరి రవీందర్, ప్రభాకర్, ప్రధాన అర్చకులు కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# నిధుల దుర్వినియోగంపై సర్పంచ్‌లకు నోటీసులు

- వారంలోపు డబ్బు రికవరీకి ఆదేశాలు
- చెక్‌పవర్ రద్దు
- సర్పంచ్‌ల్లో మొదలైన కలవరం

వేములవాడరూరల్: ప్రభుత్వ నిధులను నిబంధనల ప్రకారం వినియోగించకుండా దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్‌లపై జిల్లా అధికారులు కొరఢా ఝుళిపించారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు నాగుల వేణుగోపాల్, యామ సుమతిలకు గత మూడు రోజుల క్రితం జిల్లా పంచాయతీ అధికారుల నుంచి నోటీసులు జారీ అయినట్లు ఎంపీడీఓ రాంరెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను నిబంధనల ప్రకారం వినియోగించకుండా పక్కదారి పట్టించడంతో వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. దుర్వినియోగానికి పాల్పడిన నిధులను వారం రోజుల్లో జమ చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఫాజుల్‌నగర్ గ్రామానికి సంబంధించి రూ.80,249, వట్టెంల పంచాయతీకి సంబంధించి రూ.4.90 లక్షలు వెంటనే జమ చేయాలని నోటీసులలో పేర్కొన్నారు.

**జాయింట్ చెక్ పవర్**

గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై గ్రామానికి చెందిన కొంత మంది జిల్లా అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుతో వేములవాడ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లకు నోటీసులు జారీ అయ్యాయి. వీటితో పాటు దుర్వినియోగానికి పాల్పడిన నిధులను వారం రోజుల్లో జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రస్తుతం సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఉన్న చెక్‌పవర్‌ను ఎంపీడీఓకు జాయింట్ చెక్‌పవర్ కల్పిస్తూ డీపీవో రవీందర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. వీటిలో కొంత మంది వార్డుసభ్యుల ప్రమేయం కూడా ఉండడంతో వారికి కూడా నోటీసులు వచ్చినట్లు సమాచారం.

**సర్పంచ్‌ల్లో కలవరం**

సర్పంచ్‌ల పదవీకాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. దీంతో గ్రామాల్లో గత ఐదేళ్లలో సర్పంచ్‌లు చేసిన పలు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగినట్లు గ్రామాల్లోని కొంత మంది ఫిర్యాదు చేస్తున్నారు. ఈనేపథ్యంలో వట్టెంల, ఫాజుల్‌నగర్ సర్పంచ్‌లకు డబ్బు రికవరీతో పాటు చెక్‌పవర్‌ను కూడా మండల స్థాయికి జాయింట్ చెక్‌పవర్ కల్పిస్తూ జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మండలంలోని పలువురు సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

# 'మేడిగడ్డ' కుంగడానికి కేసీఆరే బాధ్యుడు

- కాళేశ్వరంపై సమగ్ర విచారణ జరపాల్సిందే!
- పెట్టిన ఖర్చంతా కేసీఆర్ ముక్కుపిండి వసూలు చేయాల్సిందే
- ఈ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తే నవ్వులపాలయ్యేవాళ్లం
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కాళేశ్వరం ప్రాజెక్టుపై సమగ్ర విచారణ జరపాలని, మేడిగడ్డ పిల్లర్ల కుంగిపోవడానికి కేసీఆర్ బాధ్యత వహించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం కరీంనగర్‌లో బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్‌తోపాటు మంత్రి కేటీఆర్ తీరుపైనా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోని 8 పిల్లర్లు కుంగిపోయినయ్.. సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, వంతెనలు, రోడ్లు, ఫ్లైఓవర్లకు గ్యారంటీ లేదు.. చివరకు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు కూడా గ్యారంటీ లేకుండా పోయింది.. గతంలో మల్లన్నసాగర్ రిజర్వాయర్‌దీ ఇదే పరిస్థితి.. రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిన కాళేశ్వరం నిర్మించి ఐదేళ్లు కూడా కాలేదు.. మొన్నటి వానలకు మోటార్లు నీట మునిగిపోయినయ్.. ఇప్పుడు పిల్లర్లు ఒంగిపోయి ప్రాజెక్టు ఉంటదో.. ఊడిపోతదో తెల్వదు.. దీనికి బాధ్యుడు సీఎం కేసీఆర్.. వెంటనే ఆయన నుంచి ఖర్చు చేసిన సొమ్మంతా రికవరీ చేయాలి.. ప్రాజెక్టు రూపకర్త నేనేనని, అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి అపర భగీరథుడిగా ప్రచారం చేసుకున్న కేసీఆర్ ఎటుపోయిండు..? నదులకే నడక నేర్పిన మొనగాడు ఏమైండు..? ఆయనే ఇంజినీర్, కాంట్రాక్టర్.. ఆయనే కమీషన్లు తీసుకుని ప్రజలను నట్టేట ముంచుతున్నడు.. కరోనా వస్తే పారాసిటమాల్ వేసుకోవాలని పోయి ఫాంహౌస్ లో పడుకున్నడు' అని ధ్వజమెత్తారు..

**జాతీయ హోదా ఇచ్చిఉంటే..**

'కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా రావాలనుకుని ఆశించినం.. పొరపాటున వచ్చి ఉంటే దేశవ్యాప్తంగా నవ్వులపాలయ్యేవాళ్లం.. పలుమార్లు వెళ్లిన నువ్వు కాళేశ్వరం వెళ్లి చేసిందేమిటి? నీ ఫాంహౌస్‌లో క్షుద్రపూజలు చేసి వాటిని కాళేశ్వరంలో కలపడానికి పోయినవే తప్ప.. ఏనాడూ పనుల నాణ్యతను పరిశీలించడానికి వెళ్లలేదు.. నిజంగా నాణ్యతతో ప్రాజెక్టు నిర్మించి ఉంటే.. ఇంతవరకు రాజకీయ పార్టీల నాయకులు, ఇంజినీరింగ్ నిపుణులను చూడటానికి ఎందుకు అనుమతించడం లేదు? హైదరాబాద్‌లో ఎన్నిఫోర్లతో భవంతులు కట్టుకున్నా.. కేసీఆర్ కొడుకుకు అందులో ఫ్లోర్లు నిర్మించాలి.. కేసీఆర్ కొడకా.. నీకున్న రాజకీయాల్లో డిగ్రీ ఏంది? మీ అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన నీ బతుకేంది? నేను నీలెక్క అయ్య పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి రాలేదు.. ఇకనైనా నోటిని హద్దులో పెట్టుకుని మాట్లాడు.. రెండు, మూడు రోజుల పాటు చర్చించిన అనంతరం బీజేపీ అభ్యర్థుల రెండో జాబితాను విడుదల చేయబోతున్నాం..' అని బండి సంజయ్ పేర్కొన్నారు.

# పిచ్చికుక్కల స్వైర విహారం

- ఆరుగురికి తీవ్రగాయాలు



పిచ్చి కుక్కల దాడిలో గాయపడిన రియాన్స్

చందుర్తి (వేములవాడ): ఊరంతా దసరా పండుగ సంబరాల్లో ఉండగా ఎక్కడో నుంచో వచ్చిన పిచ్చికుక్కలు ఆరుగురిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికుల కథనం ప్రకారం.. చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో సోమవారం సాయంత్రం దసరా ఉత్సవాలను తిలకించేందుకు వెళ్తున్న శ్రీరాముల అభినయ, సూత్రం రమ్య, మల్లిపల్లి భారతవ్వ, శ్రీరాముల సత్తవ్వ, దోమాల రియాన్స్‌తో పాటు కట్టలింగంపేట గ్రామానికి చెందిన ఇరుమల్ల కుంటయ్యపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చాయి. వీరిని వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్న పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

### మురికికాలువలో పడి వృద్ధుడు మృతి



గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల గాంధీనగర్ ఏరియాలోని మురికి కాలువలో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. సుమారు 52 ఏళ్ల వయస్సుగల వృద్ధుడు గాంధీచౌక్ ప్రధాన రహదారిలో గల వైన్స్ పక్కన మురికి కాలువలో పడి మృతిచెందాడు. ఒంటిపై బ్లూ కలర్ లుంగీ, తెల్లని కట్ బనియన్ ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ ఉపేందర్ తెలిపారు.

### ఆస్తి కోసం తమ్ముడిపై అన్న దాడి



చికిత్స పొందుతున్న ప్రసాద్

బోయినపల్లి(చొప్పదండి): ఆస్తి కోసం సినీఫక్కీలో తమ్ముడిపై దాడి చేసి చంపాలని చూసిన ఘటన మండలంలోని గుండన్నపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి సంచలనం సృష్టించింది. పోలీసులు, గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూమయ్యకు మల్లేశం, రాజయ్య, ప్రసాద్ ముగ్గురు కుమారులు. రాజయ్య, ప్రసాద్ మధ్య ఆస్తి గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆస్తి విషయంలో అడ్డుపడుతున్నారని పథకం ప్రకారం రాజయ్య తన కుమారుడు లక్ష్మన్ మరో ఇద్దరితో కలిసి ఊరు చివర్లో వాహనంపై వెళ్తున్న ప్రసాద్‌ను అడ్డగించి ఇనుప రాడ్లతో తీవ్రంగా కొట్టారు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కారు డిక్కీలో వేశారు. కారులో కొంతసేపు తిప్పి గుండన్నపల్లికి తీసుకెళ్లారు. ఆ సమయంలో గ్రామంలో బతుకమ్మ ఆడుతున్నారు. కారు డిక్కీలో ఉన్న ప్రసాద్ గ్రామంలో జనం మాటలు విని డిక్కీలోంచి కిందకు దూకాడు. తనను కిడ్నాప్ చేసి రాడ్లతో కాళ్లపై కొట్టారని ఏడుస్తూ గ్రామస్తులకు చెప్పాడు. దీంతో గ్రామస్తులు కారును వెంబడించి అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడ్డ ప్రసాద్‌ను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. తన సోదరుడు ప్రసాద్‌ను రాజయ్య, అతడి కుమారుడు లక్ష్మన్, మరో ఇద్దరు ఇనుపరాడ్లతో దాడి చేసి చంపాలని చూశారని ప్రసాద్ అన్న మల్లేశం ఫిర్యాదు మేరకు వేములవాడరూరల్ సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

### వాల్‌పోస్టర్ల కలకలం

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజకీయ పక్షాల నాయకులు తమ వైఖరిని మార్చుకోవాలని రాసి ఉన్న వాల్‌పోస్టర్లను ముస్తాబాద్‌లో పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ముస్తాబాద్ నుంచి సిద్దిపేట వెళ్లే రహదారిలో తెర్లుమద్ది చౌరస్తా వద్ద వాల్‌పోస్టర్ల ఘటన కలకలం రేపింది. వాల్‌పోస్టర్లలో అన్ని రాజకీయ పక్షాల నాయకులు తమ విధానాన్ని మార్చుకోవాలని నక్సలైట్ల పేరుతో హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ, వ్యక్తిగత కక్షల నేపథ్యంలోనే వాల్‌పోస్టర్లను తయారు చేసినట్లు ప్రాథమిక సమాచారం ఉందన్నారు. నకిలీలే ఈ పనికి ఒడిగట్టారని, సిరిసిల్ల ప్రాంతంలో నక్సలైట్లు లేరని స్పష్టం చేశారు.

### చెట్ల నరికివేత



చెట్లను నరికిన దృశ్యం

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని నల్లగుట్ట అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా దాదాపు 150కిపైగా చెట్లను నరికివేశారు. అటవీ ప్రాంతంలోని భూమిని చదును చేయాలనే ఉద్దేశంతో చెట్లను తొలగించారని రైతులు ఆరోపిస్తున్నారు. అటవీ అధికారులు స్పందించి చెట్లను తొలగించినవారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని, వాటి స్థానంలో మళ్లీ మొక్కలు నాటాలని కోరుతున్నారు. ఈ విషయమై ఫారెస్టు బీట్ ఆఫీసర్ బాలకృష్ణను వివరణ కోరగా, సంఘటన స్థలాన్ని పరిశీలించామని, చెట్లను తొలగించిన వారిని పట్టుకొని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

### నగదు పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని వెంకట్రావుపల్లె చెక్‌పోస్టు వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం నగదును పట్టుకున్నారు. సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టగా సిద్దిపేట నుంచి ముస్తాబాద్ వస్తున్న వాహనంలో రూ.66వేల నగదు పట్టుకున్నారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో ఆట్టి నగదును సీజ్ చేసినట్లు స్క్వాడ్ వంశీకృష్ణ తెలిపారు.

# పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధపూజ



ఆయుధపూజ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లా ప్రజలకు విజయదశమి సుఖశాంతులు తోపాటు విజయాలను చేకూర్చాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ ఆయుధాలకు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ దుర్గామాత పూజలో పాల్గొని మాట్లాడారు. పోలీస్‌శాఖలో ప్రతి అధికారి, సిబ్బంది ప్రజా రక్షణలో ముందుంటూ పోలీస్ గౌరవం, కీర్తి ప్రతిష్టలను పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు యాదగిరి,మధుకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**శాంతియుత ఎన్నికలకు సహకరించాలి**

వీర్నపల్లి(సిరిసిల్ల): ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ కోరారు. మంగళవారం వీర్నపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, ఏయే విధులు నిర్వహిస్తున్నారు తదితర వివరాలు, రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్తులు, సస్పెక్ట్‌లు, రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని సూచించారు. అనంతరం మండలంలోని వీర్నపల్లి, రంగంపేట, గర్జన్‌పల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద ప్రహరీ, సీసీ కెమెరాలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరుగకుండా ప్రజలంతా సహకరించాలని అన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా, గొడవలు సృష్టించాలని చూసినవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై నవత, సిబ్బంది పాల్గొన్నారు.

# పోటాపోటీగా ఎడ్లబండ్ల ప్రదర్శన



బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఎడ్లబండ్ల ప్రదర్శన



బీజేపీ ఆధ్వర్యంలో..

వేములవాడ: దసరా ఉత్సవాలను పురస్కరించుకుని వేములవాడలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. అలాగే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కౌన్సిలర్లు సైతం ఎడ్లబండ్ల ప్రదర్శన చేపట్టారు. సోమవారం ఉదయం మహాలక్ష్మి వీధిలోని జంబిచెట్టు ప్రాంతానికి చేరుకుని పురవీధుల్లో ఎడ్లబండి ప్రదర్శన సాగింది. పోటాపోటీగా డీజే సౌండ్స్‌తో, పార్టీల జెండా కలర్స్‌తో ర్యాలీ ముందుకు సాగింది.

# దసరా వేడుకల్లో ఉద్రిక్తత

- కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీల ఏర్పాటు వివాదాస్పదం
- పోలీసులతో నాయకుల వాగ్వాదం



ఫ్లెక్సీ తొలగిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించిన సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి.. అక్కడ ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫ్లెక్సీలు వివాదాస్పదమయ్యాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై కొందరు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు రంగంలోకి దిగి ఫ్లెక్సీలను తొలగిస్తుండగా స్థానిక సర్పంచ్, సీఐ శశిధర్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఫ్లెక్సీలను తొలగించాలని, డీజేలో బీఆర్‌ఎస్ పాటలు వేయకూడదని.. భక్తి పాటలు మాత్రమే వేసుకోవాలని సీఐ సూచించారు. ఈక్రమంలోనే కొంతమంది స్థానికులు అక్కడికి చేరుకోగా, సర్పంచ్ ఏర్పాటు చేసుకున్న బౌన్సర్లు వారిని తోసివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఇరువర్గాలను పోలీసులు సముదాయించారు.

# రాచర్లగొల్లపల్లిలో దొంగతనం

- 4 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.2లక్షల నగదు అపహరణ



దొంగలు చిందరవందర చేసిన వస్తువులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లిలో ఆదివారం రాత్రి ఓ ఇంట్లో దొంగలు చొరబడి నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. పోలీసుల వివరాలు.. గ్రామానికి చెందిన తడగొండ మహిపాల్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం వేసి ఉండడం గమనించిన దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను ధ్వంసం చేసి అందులో దాచి ఉంచిన 4 తులాల బంగారం, 10 తులాల వెండి నగలు, రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పండుగ పూట బంధువుల ఇంటి నుంచి తిరిగి వచ్చిన మహిపాల్ కుటుంబ సభ్యులు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**కిరాణం షాపులో చోరీ**

చందుర్తి(వేములవాడ): మండలంలోని మర్రిగడ్డ గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం కిరాణషాపులో చోరీ జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలోని సానియా కిరాణ షాపు యజమాని ఫక్రొద్దీన్ మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో అన్నం తినేందుకు ఇంటికి వెళ్లాడు. ఇదే అదను భావించిన దొంగలు దుకాణంలోని వెనుక ద్వారం నుంచి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లో రూ.35వేల చిట్టీ డబ్బులు, రూ.15 వేలు దుకాణ సామగ్రికి చెల్లించేందుకు జమ చేసుకున్న డబ్బు మొత్తం రూ.50 ఎత్తుకెళ్లారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై అశోక్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయగా రెండు వైపులా వెళ్లడంతో స్థానికులే చోరీకి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

### 27న ఉమ్మడిజిల్లా ఎస్జీఎఫ్ యోగా పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ నెల 27న ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 17, 19, బాలబాలికల యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, సీహెచ్.జనార్దన్‌రావు తెలిపారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించిన బాలబాలికలు సంబంధిత అర్హత ధ్రువపత్రాలతో ఉదయం 10గంటలకు స్పోర్ట్స్ స్కూల్‌లో జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్‌కు రిపోర్టు చేయాలన్నారు. పూర్తి వివరాలకు 9948750362 నంబరులో సంప్రదించాలని సూచించారు.



### రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ: దసరా వేడుకలు, సెలవులు ముగింపు దశకు చేరుకుంటుండటంతో సోమ, మంగళవారాల్లో రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని కోడె మొక్కులు చెల్లించుకున్నారు.